క్లుప్తంగా

సకాలంలో నివేదికలు అందించండి



ఎన్నికల వ్యయ పరిశీలకుడు వినాయక్‌కు స్వాగతం పలుకుతున్న సబ్ కలెక్టర్

పెనుకొండ: ప్రస్తుతం జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులకు సంబంధించిన ఖర్చుల వివరాలతో కూడిన నివేదికను సకాలంలో అందజేయాలని పెనుకొండ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు బి. వినాయక్ పేర్కొన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి అపూర్వ భరత్‌తో కలసి ఎన్నికల వ్యయ పరిశీలకులు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి బృందంతో వ్యక్తిగతంగా చర్చించారు. పూర్తిస్థాయి నివేదికలను ఎప్పటికప్పుడు సకాలంలో అందజేయాలని సూచించారు. ఎన్నికల నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలన్నారు. అంతకుముందు ఎన్నికల వ్యయ పరిశీలకులు బి. వినాయక్‌కు ఘన సబ్‌కలెక్టర్ స్వాగతం పలికారు.

శ్మశాన వాటిక పరిశీలన



శ్మశాన వాటికను పరిశీలిస్తున్న అధికారులు

లేపాక్షి: మండలంలోని కొండూరు పంచాయతీ పరిధిలోని వడ్డిపల్లి గ్రామంలో ఉన్న శ్మశాన వాటికను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రమీలమ్మ, వీఆర్‌ఓ శేషాచలం, జమేదార్ లక్ష్మీపతి, పోలీసు సిబ్బంది శుక్రవారం ఉదయం పరిశీలించారు. శ్మశాన వాటికలో సమాధిని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ స్థానికులు అందించిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించారు. దీనికి సంబంధించిన నివేదికను తహసీల్దార్, ఎస్ఐల దృష్టికి తీసుకెళ్లి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో జ్యోతుల ఉత్సవం



చిన్నకోడిపల్లిలో జ్యోతులు మోస్తున్న మహిళలు

రొద్దం: మండల పరిధిలోని చిన్నకోడిపల్లి గ్రామంలో వెలసిన గ్రామ దేవత స్వప్పలమ్మకు శుక్రవారం జ్యోతుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం మహిళలు గ్రామంలో జ్యోతులతో ఆయాలనికి ప్రదర్శనగా వెళ్లి జ్యోతులను అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మంత్రి ఉషశ్రీచరణ్ ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించారు.

ఘనంగా వేణురెడ్డి జన్మదినం




వేణురెడ్డికి కేక్ తినిపిస్తున్న దృశ్యం

హిందూపురం: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి టీఎన్ దీపిక ఆధ్వర్యంలో పార్టీ నియోజకవర్గ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్దకు పార్టీ శ్రేణులు తరలివచ్చి వేణురెడ్డి, దీపిక దంపతులకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

సరస్వతీదేవి పూజ

రొళ్ల: మండల పరిధిలోని రత్నగిరి ఆదర్శ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సరస్వతీదేవి పూజను ఘనంగా నిర్వహించారు. తొలుత సరస్వతీదేవి, గణపతి, లక్ష్మీదేవి చిత్రపటాలను ఉంచి విశేష పూజలు చేశారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు, చాక్లెట్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం హరిప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సిద్ధారూఢస్వామికి రొట్టెల ఉత్సవం



రొట్టెల ఉత్సవానికి స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని తరలిస్తున్న దృశ్యం

అమరాపురం: మండలంలోని తమ్మడేపల్లికి వెళ్లే రహదారిలోని చెరువు కట్ట మీద వెలసిన సిద్ధారూఢస్వామి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రొట్టెల ఉత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉత్సవమూర్తిని పూజల అనంతరం జువ్విమాను కట్ట వద్దకు రొట్టెల ఉత్సవానికి తరలించారు. అక్కడ రొట్టెలు తయారు చేసి నైవేద్యం పెట్టారు. అనంతరం వచ్చిన భక్తులకు రొట్టెలను అందజేశారు.

చంద్రబాబును నమ్మితే కష్టాలు తప్పవు

- మంచి చేస్తున్న జగనన్నను ఆదరించండి
- మంత్రి ఉషశ్రీచరణ్



పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని కోనాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్



మంత్రి ఉషశ్రీ చరణ్‌కు ఘన స్వాగతం పలుకుతున్న ప్రజలు, నాయకులు, కార్యకర్తలు

పెనుకొండ: జగనన్నను కాదని టీడీపీ కూటమికి పట్టం కడితే సంక్షేమ పథకాలకు చరమగీతం పాడతారు. చంద్రబాబు మోసపూరిత మాటలు నమ్మితే ప్రజలకు కష్టాలు తప్పవు 'అని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖామంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. పెనుకొండ మున్సిపల్ పరిధిలోని కోనాపురం, మంగాపురం గ్రామాల్లో కోఆప్షన్ మెంబర్ వెంకటరామిరెడ్డి, కౌన్సిలర్ సంజీవమ్మ, మారుతి, కౌన్సిలర్ భాస్కర్‌నాయక్, మాజీ ఎంపీటీసీ అనిత ఆధ్వర్యంలో శుక్రవారం మంత్రి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా నవరత్నాలను పక్కాగా అమలు చేసి ప్రతి ఇంట్లో సంతోషం నింపారన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎవరూ చేయని విధంగా పేదలు, మహిళలు, ఇతర అన్ని వర్గాల ప్రజలకు రూ.1.75 లక్షల కోట్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి వేసి ఎక్కడా అవినీతి అన్న పదానికి తావు లేకుండా చేశారన్నారు. అర్హత ఉంటే చాలు ఇంటి వద్దకే పథకాలు అందించారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఆర్థికంగా, రాజకీయంగా ఉన్నత స్థానాలకు చేర్చిన గొప్ప వ్యక్తి జగనన్న అని కొనియాడారు. ప్రజారంజక పాలన అందించిన వైఎస్ జగన్‌ను ప్రజలు దీవించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చంద్రబాబు మోసపూరిత మాటలు నమ్మవద్దని ఆయనను నమ్మితే ప్రజలకు కష్టాలు తప్పవన్నారు. చంద్రబాబుకు అధికారమిస్తే ప్రజలపై విషం చిమ్ముతారన్నారు. గతంలో ఇలాగే ప్రజలకు మోసపూరిత హామీలిచ్చి గెలిచాక ఏ మాత్రం పట్టించుకోలేదని గుర్తు చేశారు. స్థానికులు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా గెలిచిన వెంటనే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ బోయ నరసింహ, ఏజీపీ భాస్కరరెడ్డి, నగర పంచాయతీ వైస్ చైర్మన్ సునీల్, కౌన్సిలర్లు రఘునాథరెడ్డి, సుధాకరరెడ్డి, తయూబ్, సద్దాం, ముఖ్యనాయకులు గుట్టూరు ఆంజినేయులు, జయశంకరరెడ్డి, బోయబాబు, శ్రీరాములు, ఫరీద్, ఇర్షాద్, యాసిన్, వెంకటేష్, సిక్బతుల్లా, షామీర్, రాము, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: మండల పరిధిలోని తిప్పారాజుపల్లి, జీనంవాండ్లపల్లి, చింతమానుపల్లి, ఖాంగా రెడ్డిపల్లి, రాంపురం, మల్లేల, కొండాపురం, చలమయ్యగారిపల్లి, రాగిమాకులపల్లి, వెంకటరమణపల్లి, పెరమాళ్లపల్లి, నల్లన్నపల్లి, శెట్టిచన్నంపల్లి, పులేరు, మరేడ్డిపల్లి గ్రామాల్లో మంత్రి ఉషశ్రీచరణ్ శుక్రవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసం 600 కు పైగా హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు అన్ని వర్గాలను మోసం చేసిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. అన్ని వర్గాలకు మంచి చేస్తున్న జగనన్నను మరోసారి ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. తనతో పాటు ఎంపీ అభ్యర్థి శాంతమ్మను ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, మంత్రి ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఫక్రుద్దీన్‌సాహెబ్, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు బాషా తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నుంచే ఓటు

- 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు వెసులుబాటు
- బీఎల్ఓల ద్వారా అర్హుల గుర్తింపు



ఇంటింటి సర్వే చేపడుతున్న బీఎల్ఓలు

హిందూపురం టౌన్: ఓటు వేయాలనే ఆసక్తి ఉన్నా వయోభారంతో ఇల్లు కదల్లేని వారికి, దివ్యాంగులకు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక అవకాశాన్ని కల్పించింది. ఓట్ ఫ్రం హోం పద్ధతిలో వారు తమ ఓటు హక్కును ఇంటి నుంచి వేసే వెసులుబాటు ఇచ్చింది. ఏప్రిల్ 18 నుంచి 21వ తేదీ వరకూ బూత్ లెవల్ ఆఫీసర్లు ఇంటింటా తిరిగి హోం ఓటింగ్‌కు అర్హులైన వారిని గుర్తిస్తున్నారు. అర్హులైన వారు మే 2, 3వ తేదీల్లో ఓటు వినియోగించుకోవాల్సి ఉంటుంది. వారి వద్దకు సెక్టోరల్ అధికారులు, బీఎల్ఓలు, పోలింగ్ ఏజెంట్లు, సూపర్‌వైజర్లు వెళ్తారు. శరీరం సహకరించలేని వారికి సహాయకులను నియమిస్తారు. ఈ సహాయకులకు కుడి వేలుపై సిరా గుర్తు వేస్తారు. మళ్లీ ఆ సహాయకుడు ఓటును వినియోగించుకునేందుకు అవకాశం ఉంటుంది. ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా 85 ఏళ్లు పైబడిన వృద్ధులను, వికలాంగులను గుర్తించారు. వారికి 12-డీ ఫారాలను సైతం అందిస్తున్నారు.

హిందూపురంలో వయోవృద్ధులు, వికలాంగుల వివరాలు

మండలం	వయో వృద్ధులు	వికలాంగులు
హిందూపురం అర్బన్	227	756
హిందూపురం రూరల్	710	966
లేపాక్షి	345	566
చిలమత్తూరు	309	4

జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం



ఇంటింటి ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఈరలక్కప్ప, శాంతమ్మ

రొళ్ల: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ప్రజలు తమ ఓటు ద్వారా మద్దతుగా నిలిచి మళ్లీ వైఎస్ జగనన్నను ముఖ్యమంత్రి చేసుకుందామని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఈరలక్కప్ప, శాంతమ్మ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గుడ్డగుర్కి పంచాయతీలోని గుడ్డగుర్కి, వన్నప్పపాళ్యం, గొట్టుగుర్కిగొల్లహట్టి, గొట్టుగుర్కి, క్యాతప్పపాళ్యం, దానప్పపాళ్యం, జీఎన్ పాళ్యంతో పాటు దొడ్డేరి పంచాయతీ రంగనపల్లి, వెంకటంపల్లి, పిల్లిగుండ్లు, పి.గొల్లహట్టి, దొడ్డేరి, కొత్తపల్లి తదితర గ్రామాల్లో వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల వేళ ప్రతిపక్ష పార్టీలు ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇస్తూ ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నిస్తున్నారన్నారు. 2014 ఎన్నికలకు ముందు చంద్రబాబు 600 పైగాగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాలను మోసం చేశారన్నారు. కేవలం ఉనికి కాపాడుకోవడం కోసం జనసేన, బీజేపీతో టీడీపీ పార్టీ పొత్తులు పెట్టుకుని మళ్లీ ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని ఎద్దేవా చేశారు. సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి చేరిక

మండల పరిధిలోని గుడ్డగుర్కిలో శుక్రవారం అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గోవిందప్ప కుమారుడు మారుతి టీడీపీని వీడి తన అనుచరులతో కలిసి వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారికి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఈరలక్కప్ప, శాంతమ్మ పార్టీ కండువా వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌కు సన్మానం

మండల పరిధిలోని దొడ్డేరి పంచాయతీ రంగనపల్లి గ్రామంలో శుక్రవారం సాయంత్రం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను దొడ్డేరి సర్పంచ్ అనిత, తాలూకా జేసీఎస్ బూత్ ఇన్‌చార్జ్ నాగేంద్ర తదితరులు ఘనంగా సన్మానించారు. బోయ గిరిజమ్మ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే ధ్యేయంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని సూచించారు. టీడీపీ పార్టీ నాయకులు చెప్పే మాయమాటలను తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ నళిని, మడకశిర అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జ్ అనంతరాజు, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రంగేగౌడు, రాష్ట్ర బీసీ విభాగం ఉపాధ్యక్షుడు కాంతరాజు, రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ నేత్రావతి, తాలూకా జేసీఎస్ బూత్ ఇన్‌చార్జ్ నాగేంద్ర, ఎంపీపీ కవిత, వైస్ ఎంపీపీలు రత్నమ్మ, నాగరాజు, సర్పంచులు అనిత, హరికృష్ణ, సదాశివప్ప, ప్రకాష్, ఎంపీటీసీ లింగరాజు, మండల జేసీఎస్ కన్వీనర్లు లోకేష్, కేటీ నాగేంద్ర, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు సంతోష్, పార్టీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, పార్టీ మాజీ మండల కన్వీనర్ తిమ్మప్ప, మార్కెట్ యార్డు డైరెక్టర్ శ్రీనివాస్, సింగిల్ విండో డైరెక్టర్ శివలింగప్ప, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు విజయరంగేగౌడు, రంగప్పరాజు తదితరులు పాల్గొన్నారు.

నంజావధూతస్వామిని కలిసిన శాంతమ్మ, ఈరలక్కప్ప

మడకశిర: నియోజకవర్గానికి ఆనుకుని ఉన్న శిర తాలూకా పట్టనాయకనహళ్లిలో శుక్రవారం నంజావధూతస్వామిని వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి శాంతమ్మ, ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప కలిశారు. ఈ సందర్భంగా వారు స్వామివారి ఆశీర్వాదాన్ని పొందారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ విభాగం ఉపాధ్యక్షుడు కాంతరాజు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ అనంతరాజు, రొళ్ల మండల కన్వీనర్ నరసింహారెడ్డి, కుంచిటి వక్కలిగ సంఘం నాయకులు పాల్గొన్నారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా



మడకశిర: వైఎస్సార్‌సీపీ నాయకుల సమక్షంలో రాజీనామా చేసి పత్రాలను చూపిస్తున్న వలంటీర్లు

అమరాపురం: మండల పరిధిలోని హేమావతి గ్రామ సచివాలయం పరిధిలోని 11 మంది వలంటీర్లు రాజీనామ పత్రాలను కార్యదర్శి నరేష్‌కుమార్‌కు శుక్రవారం సమర్పించారు. ఈ సందర్భంగా వలంటీర్లు రాజు, హేమంత్, అమూల్య, సౌమ్య, శివలింగప్ప, రంగస్వామి, సుమిత్ర, అంజలి, ప్రభాకర్, పాతలింగప్పలు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేస్తామన్నారు.

మడకశిరరూరల్: మండల పరిధిలోని అమిదాలగొంది, ఆర్ అనంతపురం, వైబీ హళ్లి పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న 30 మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వైఎస్ రవిశేఖర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జీటీ శివకుమార్‌ల ఆధ్వర్యంలో రాజీనామా చేస్తున్నట్లు వలంటీర్లు సరస్వతి, నాగరత్నమ్మ, గౌతమి, సరేష్, రమేష్, పరిమళ, చంద్రశేఖర్, నాగార్జున తదితరులు తెలిపారు.

గోరంట్ల: గోరంట్ల మేజర్ పంచాయితీలోని ఐదు సచివాలయాలకు చెందిన 34 మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. ఇందులో భాగంగానే రాజీనామ లేఖలను ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్‌కు అందజేశారు.

రొద్దం: మండల పరిధిలోని కంబాలపల్లి గ్రామ సచివాలయ పరిధిలో పనిచేస్తున్న ఆరుగురు వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను సచివాలయ సిబ్బందికి అందజేశారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



మంటలు ఆర్పడంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణంలో శుక్రవారం అగ్ని ప్రమాదాల నివారణపై డెమో ద్వారా అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్లు దివాకర్, పూర్ణిమ, అగ్నిమాపక అధికారి విజయకుమార్, సిబ్బంది, పాల్గొన్నారు.

హిందూపురం అర్బన్: ఆస్పత్రుల్లో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? రోగులను ఎలా రక్షించాలి అన్న దానిపై శుక్రవారం పట్టణంలోని తేజా, ఏఆర్ ఆస్పత్రుల్లో ఫైర్ ఆఫీసర్ ప్రభాకర్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ అమర్‌నాథ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విలువలతో కూడిన న్యాయసేవలు



న్యాయమూర్తి శంకరరావును సన్మానిస్తున్న న్యాయవాదులు

పెనుకొండ: పట్టణంలోని న్యాయవాదులు విలువలతో కూడిన న్యాయసేవలు అందిస్తున్నారని సీనియర్ సివిల్ జడ్జి శంకరరావు పేర్కొన్నారు. న్యాయమూర్తి శంకరరావు అనంతపురానికి బదిలీ అయిన సందర్భంగా న్యాయవాదులు శుక్రవారం స్థానిక విశ్రాంత భవనంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి శంకరరావు మాట్లాడుతూ పెనుకొండలో పని చేయడం ఒక తీయని అనుభూతిని మిగిల్చిందన్నారు. న్యాయమూర్తిగానే కాకుండా అనేక సామాజిక కార్యక్రమాల్లో పాలు పంచుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. న్యాయవాదులు, కోర్టు సిబ్బంది అందించిన సహకారం మరువలేనిదన్నారు. ఇదే స్ఫూర్తితో బదలీ అయిన స్థానంలో పని చేస్తానని శంకరరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి సయ్యద్ ముజీబ్ పసుపుల, న్యాయవాదులు మదన్‌మోహన్‌రెడ్డి, చంద్రశేఖరరెడ్డి, ఆసిఫ్, ఏజీపీ భాస్కరరెడ్డి, మోహన్‌నాయక్, నాగార్జున, సుదర్శన్‌రెడ్డి, శివారెడ్డి, విశ్వనాథనాయక్, శరత్, రాజేష్‌నాయక్, దయానందరెడ్డి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఇంటింటి ప్రచారం



మద్దనకుంటలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

అమరాపురం: మండలంలోని మద్దనకుంట, నిద్రగట్ట పంచాయతీ గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్, రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ గగన, మద్దనకుంట సర్పంచ్ గోవిందరాయ, ఎంపీటీసీ హనుమంతరాయ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన సంక్షేమాభివృద్ధిని వివరించి ఫ్యాన్‌గుర్తుకే ఓటు వేయాలని కోరారు.

మూడు నామినేషన్లు దాఖలు

హిందూపురం: నామినేషన్ల స్వీకరణల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మొత్తం మూడు నామినేషన్లు దాఖలు అయ్యాయి. హిందూపురం తహసీల్దార్ కార్యాలయంలో సంయుక్త కలెక్టర్, నియోజకవర్గ ఆర్ఓ. అభిషేక్ కుమార్ ఆధ్వర్యంలో హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ చేపట్టారు. టీడీపీ అసెంబ్లీ అభ్యర్థిగా నందమూరి బాలకృష్ణ రెండు సెట్లుగా నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రసమితి అభ్యర్థిగా కోడూమూరు నౌషాద్ నామినేషన్ దాఖలు చేసినట్లు అధికారులు తెలిపారు.

నీటి కోసమే బీజేపీతో దోస్తీ



మాట్లాడుతున్న మాజీ సీఎం కుమారస్వామి

పావగడ: తుంగభద్ర, కావేరి జలాల సాధన కోసమే బీజేపీతో పొత్తు కుదుర్చుకున్నామని జేడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ సీఎం హెచ్‌డీ కుమారస్వామి స్పష్టం చేశారు. స్థానిక ఎస్ఎస్‌కే రంగ మందిరంలో శుక్రవారం నిర్వహించిన చిత్రదుర్గం లోక్‌సభ ఎన్‌డీఏ అభ్యర్థి గోవింద కారజోళ ఎన్నికల ప్రచార సభలో పాల్గొని ఆయన మాట్లాడారు. కేంద్రంలో ఏర్పడే ఎన్‌డీఏ ప్రభుత్వం కర్ణాటక రాష్ట్రాభివృద్ధికి సహకరిస్తుందనే నమ్మకం ఉందన్నారు. కాంగ్రెస్‌తో పాటే కరువు కూడా వచ్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక వర్షాలు కురవలేదన్నారు. కాంగ్రెస్ పనికిరాని ఆలోచనలతో రాష్ట్రం దివాలా తీసిందన్నారు. రైతులకు కూడా ఈ ప్రభుత్వం చేసింది శూన్యమన్నారు. తన హయాంలో రూ. 50 వేల వరకూ రైతులకు రుణమాఫీ చేసినట్లు గుర్తు చేశారు. ఎన్‌డీఏ అభ్యర్థి గోవింద కారజోళను అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో అభ్యర్థి గోవింద కారజోళ, మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప, బీజేపీ తాలూకా అధ్యక్షుడు రంగణ్ణ, జేడీఎస్ అధ్యక్షుడు ఎన్ఏ ఈరణ్ణ, ఆర్పి అంజినప్ప, పార్టీ మహిళాధ్యక్షురాలు అంబికా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతో దేశం ఛిన్నాభిన్నం



మాట్లాడుతున్న హోంమంత్రి పరమేశ్వర్

పావగడ: మతోన్మాద చర్యలతో బీజేపీ దేశాన్ని ఛిన్నాభిన్నం చేస్తోందని రాష్ట్ర హోంశాఖ మంత్రి డా పరమేశ్వర్ విమర్శించారు. స్థానిక మారుతీ థియేటర్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఒక్క పైసా కూడా అందివ్వలేదని, జీఎస్టీ, ఎన్‌డీఆర్ఎఫ్‌లో సైతం తమకు రావాల్సిన వాటాలో చిల్లి గవ్వ కూడా అందించలేదని విమర్శించారు. వచ్చే లోక్ సభ ఎన్నికల్లో బీజేపీకి 200 సీట్లు కూడా రావన్నారు. అత్యధిక స్థానాల్లో గెలిచి ఇండియా కూటమి అధికార పగ్గాలు చేపట్టే అవకాశముందన్నారు. చిత్రదుర్గం లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి చంద్రప్పను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకటేష్, మాజీ మంత్రి వెంకటరమణప్ప, బ్లాక్, రూరల్ కాంగ్రెస్ అధ్యక్షులు సుదేశ్ బాబు, రామాంజినప్ప తదితరులు పాల్గొన్నారు.

కుంచిటి వక్కలిగ భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం

మడకశిర: మడకశిరలో కుంచిటి వక్కలిగ భవన నిర్మాణానికి శుక్రవారం పట్టనాయకనహళ్లి నంజావధూతస్వామి రూ.1,00,004 విరాళాన్ని అందించారు. శుక్రవారం ఇందుకు సంబంధించిన చెక్‌ను సంఘం అధ్యక్షుడు అనంతరాజుకు అందించారు. పార్లమెంట్ అభ్యర్థి శాంతమ్మ, ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప సమక్షంలో ఈచెక్‌ను అందించారు. కుంచిటి వక్కలిగ భవన నిర్మాణానికి విరాళం అందించిన నంజావధూతస్వామికి కుంచిటి వక్కలిగ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కాంతరాజు, నేత్రావతి, నరసింహారెడ్డి, తిప్పేస్వామి, రాజన్న, జయరామ్, మంజునాథ్, రమేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మడకశిరరూరల్: 132 కేవీ సబ్‌స్టేషన్ గొల్లపల్లి విద్యుత్ లైన్ అత్యవసర మరమ్మతు కారణంగా శనివారం మండలంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఏ సుబ్రహ్మణ్యప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని మడకశిర, ఆర్ అనంతపురం, కల్లుమర్రి, నీలకంఠాపురం విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.



బ్రహ్మరథోత్సవంలో భక్తుల సందడి

ఘనంగా ఉట్ల పరుష

మడకశిరరూరల్: మండల పరిధిలోని నీలకంఠాపురంలో సీతారాములు, కోదండ స్వామివార్ల బ్రహ్మరథోత్సవం, ఉట్లమాను పరుష, జ్యోతుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సమీప గ్రామాల మహిళలు భక్తిశ్రద్ధలతో జ్యోతులను మోస్తూ నీలకంఠేశ్వరస్వామికి సమర్పించి పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయం వద్ద ఉట్లమాను ఉత్సవాన్ని నిర్వహించగా ఉట్లమాను ఎక్కేందుకు యువకులు పోటీ పడ్డారు.



ఉట్ల మాను ఎక్కి ఉట్టిని కొడుతున్న యువకులు

పోస్టల్ బ్యాలెట్ వివరాలు అందజేయండి

పెనుకొండ: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పెనుకొండ నియోజకవర్గంలో ఓటర్లై ఉండి పీఓ, ఏపీఓ, ఓపీఓగా ఎలక్షన్ విధులు నిర్వర్తించే ప్రతి ఒక్కరూ పోస్టల్ బ్యాలెట్ వివరాలను ఆయా తహసీల్దార్ కార్యాలయాల్లో ఈ నెల 24వ తేదీ లోపు అందజేయాలని తహసీల్దార్ ఉదయ శంకరరాజు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ఫారం 12 పాటు ఆర్డర్ కాపీ, ఎపిక్ కార్డును అందజేయాలని సూచించారు.

నేడు ఎన్నికల ప్రచారం

అమరాపురం: మండల పరిధిలోని నిద్రగట్ట గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాలతో పాటు హేమావతి గ్రామ పంచాయతీ పరిధిలో శనివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ, ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప హాజరు కానున్నట్లు చెప్పారు.

లేపాక్షి: మండలంలోని పులమతి గ్రామంలో శనివారం సాయంత్రం 3 గంటల నుంచి వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించనున్నట్లు మండల కన్వీనర్ నారాయణస్వామి తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు శాంతమ్మ, దీపిక హాజరవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.